సాక్షి విశాఖపట్నం

గురువారం, 16, నవంబర్, 2023



జ్ఞానధార

విద్యార్థులను ఉన్నత ప్రమాణాలు కలిగిన విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో లైబ్రరీలు జ్ఞాన దీపికలుగా నిలుస్తున్నాయి. 8లో



ఆత్మజ్ఞానంతోనే మోక్షజ్ఞానం

ఆత్మజ్ఞానంతోనే మోక్షజానం సాకారమవుతుందని ప్రవచనకర్త డాక్టర్ గరికిపాటి నరసింహారావు సూచించారు. 8లో



భీమిలి బీచ్‌లో అల్లరి నరేష్ సందడి 8లో

న్యూస్‌రీల్

గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఆత్మీయ వీడ్కోలు



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వీడ్కోలు చెబుతున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు మండలంలో పర్యటన ముగించుకుని తిరుగు పయనమైన గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు విశాఖలో అధికారులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. అరకు మండల పర్యటన అనంతరం బుధవారం సాయంత్రం గవర్నర్ విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ నుంచి విమానంలో తిరిగి హైదరాబాద్ వెళ్లారు. విమానాశ్రయంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, డీసీపీ ఆనందరెడ్డి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి.. గవర్నర్‌కు వీడ్కోలు పలికారు.

అప్పన్న సన్నిధిలో గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్‌కి అప్పన్న జ్ఞాపిక అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సిహెచ్.మానవేంద్రనాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని, జ్ఞాపికను దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అందజేశారు.

నేడు మైనార్టీ కమిషన్ వినతుల స్వీకరణ

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్ గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కలెక్టరేట్‌లో అందుబాటులో ఉంటారని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సయ్యద్ సిరాజుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఆయనతోపాటు కమిషన్ వైస్ చైర్మన్ ఆదిపి జాషువా డేనియల్, సభ్యులు సయ్యద్ హిదయతుల్లా, షేక్ సైపుల్లా, జితేందర్ సింగ్ కూడా కలెక్టరేట్‌కు వస్తున్నారు. మైనార్టీ కమిషన్ పరిధిలోకి వచ్చే ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు తమ సమస్యలను కమిషన్‌కు రాత పూర్వకంగా నేరుగా అందజేయవచ్చని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలోని మైనార్టీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జూలోకి బాణసంచా తీసుకురావద్దు

ఆరిలోవ: నాగులచవితి పూజలకు జూకి వచ్చే వారు ఎలాంటి బాణసంచాను లోపలకు తీసుకురావద్దని క్యూరేటర్ నందనీ సలారియా బుధవారం ఓ ప్రకటనలో కోరారు. నాగుల చవితి సందర్భంగా భక్తుల కోసం ఉదయం 7.30 గంటలకే జూ పార్కు తెరుస్తామన్నారు. నిబంధనలను అతిక్రమించి బాణసంచా తీసుకొచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెత్తను డస్ట్‌బిన్లలో మాత్రమే వేయాలన్నారు. భక్తుల కోసం అన్ని సౌకర్యాలు కల్పించామని, సేదదీరడానికి సిమెంట్ బెంచీలు, తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

డీవీఈవోగా బాధ్యతలు స్వీకరించిన రాధ



విశాఖ విద్య: జిల్లా వృత్తి విద్యాశాఖాధికారిణిగా బి.రాధ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న రాధకు విశాఖ జిల్లా డీవీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇంటర్మీడియెట్ విద్య కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆమె విశాఖలోని డీవీఈవో కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. ఆమెకు కార్యాలయ అధికారులు, వివిధ కళాశాలలకు చెందిన ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు. కాగా ప్రస్తుతం డీవీఈవోగా పనిచేస్తున్న రాయల సత్యనారాయణ ఆర్ఐవోగా కూడా వ్యవహరిస్తున్నారు. 2024 జనవరిలో ఆయన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల ముందస్తు ఏర్పాట్లలో భాగంగా సీనియర్ ప్రిన్సిపాల్ అయిన రాధను డీవీఈవోగా నియమించారు.

తీరంలో క్రికెట్ సంబరం





క్రికెట్ అభిమానుల కేరింతల ముందు సాగర ఘోష చిన్నబోయింది. వాంఖడే మైదానంలో సిక్సర్లు, ఫోర్ల మోత మోగుతుంటే.. తీరంలో అభిమానుల కోలాహలం అంబరాన్ని తాకింది. క్రికెట్ అభిమానులతో విశాఖ తీరం జనసంద్రంగా మారింది. ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌ను చివరి వరకు తనివితీరా ఆస్వాదించారు. భారత్–న్యూజిలాండ్‌ల మధ్య బుధవారం జరిగిన ప్రపంచ కప్ సెమీస్ ఫైనల్ మ్యాచ్‌ను ఆర్కే బీచ్‌లో ఆంధ్రా క్రికెట్ సంఘం భారీ స్క్రీన్‌పై ప్రత్యక్ష ప్రసారం చేసింది. తొలిసారిగా అభిమానుల ప్రాంగణం పేరిట ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్లపై మ్యాచ్‌ను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. ఫ్లడ్‌లైట్లతో పాటు అభిమానులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక టెంట్లు, ఫుడ్‌కోర్టులను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా కేరళ సంప్రదాయ వాయిద్య బృందాలను ఏర్పాటు చేసి అభిమానులను ఉత్సాహపరిచారు. ఇంతమంది మధ్య మ్యాచ్ చూస్తే.. మైదానంలో మ్యాచ్‌ను చూసిన ఫీల్ కలిగిందని అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు. విరాట్ కోహ్లి 50వ శతకం పూర్తి చేసిన సందర్భంలో అయితే కింగ్ కోహ్లి నినాదాలతో ప్రాంగణం దద్దరిల్లిపోయింది. భారత్ జట్టు అఖండ విజయం సాధించి ఫైనల్‌కు చేరడంతో విశాఖ నగర ప్రజలు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

– విశాఖ స్పోర్ట్స్

పోర్టు మరో మైలురాయి

- 228 రోజుల్లో 50 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకు హ్యాండ్లింగ్
- పోర్టు ఏర్పడిన 90 ఏళ్లలో ఇదే అతిపెద్ద నిర్వహణ
- ఈ ఏడాది 83 మిలియన్ ఎంటీ లక్ష్యాన్ని చేరుకునే దిశగా పరుగులు
- బెర్తుల ఆధునికీకరణతో అత్యుత్తమ ఫలితాలు



సాక్షి, విశాఖపట్నం : ఈస్ట్ కోస్ట్ గేట్‌వే ఆఫ్ ఇండియాగా నౌకాయానంలో అంతర్జాతీయంగా ఎదుగుతున్న విశాఖపట్నం పోర్టు అథారిటీ.. సరకు రవాణాలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. పోర్టు చరిత్రలోనే అతి పెద్ద మైలు రాయిని అధిగమిస్తూ.. సరకు రవాణాలో ఏటికేడూ వృద్ధిలో దూసుకుపోతోంది. కేవలం 228 రోజుల్లోనే 50 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకు హ్యాండ్లింగ్ చేస్తూ అతి తక్కువ రోజుల్లోనే ఈ ఘనత సాధించింది. బెర్తుల ఆధునికీకరణతో ఈ ఏడాది నిర్దేశించుకున్న 83 మిలియన్ మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని చేరుకునే దిశగా పరుగులు పెడుతోంది.

వచ్చే రెండేళ్లలో నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు మౌలిక వసతుల కల్పన, జెట్టీల విస్తరణ ఇతర అభివృద్ధి పనులతో విశాఖపట్నం పోర్టు అథారిటీ ఎప్పటికప్పుడు కొత్త రికార్డులు నమోదు చేసుకుంటోంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ కేవలం 228 రోజుల్లో 50 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకును రవాణా చేసి నూతన రికార్డును నెలకొల్పింది. గతంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో 50 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకును హ్యాండిల్ చేసేందుకు 251 రోజుల సమయం పట్టింది. ట్రాఫిక్ మేనేజర్ రత్నశేఖర్ నేతృత్వంలో ఈ ఘనతని అందుకుంది. పోర్టు ఏర్పడిన 90 ఏళ్లలో ఇదే అతి తక్కువ రోజుల్లో చేరుకున్న ఘనత కావడం విశేషం.

బెర్తుల ఆధునికీకరణతో...

విశాఖపట్నం పోర్టు పరిధిలో యాంత్రీకరణ పనులను పీపీపీ పద్ధతిలో నిర్వహిస్తున్నారు. ఈక్యూ 7, డబ్ల్యూ క్యూ 7, 8, డబ్ల్యూక్యూ 6 మూడు బెర్త్‌లను యాంత్రీకరించే పనిని విశాఖపట్నం పోర్టు చేపట్టింది. ఇందుకోసం పోర్టు రూ.655 కోట్లు కేటాయించింది. ఇలా ఎప్పటికప్పుడు యాంత్రీకరణ, ఆధునికీకరణ పనుల్ని నిర్వహిస్తూ రికార్డులను నమోదు చేయడంలో పోర్టు తనదైన మార్కుని చూపిస్తోంది.

లక్ష్యం దిశగా అడుగులు



వీపీఏలో నిబద్ధతతో కూడిన సిబ్బంది, పిపిపి ఆపరేటర్లు, వ్యాపార భాగస్వాముల సహకారంతో వివిధ విభాగాల సరకు హ్యాండ్లింగ్‌లో రికార్డులను అధిగమిస్తున్నాం. 2023–24 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న 83 మిలియన్ మెట్రిక్ టన్నుల హ్యాండ్లింగ్ రికార్డును చేరుకునే దిశగా అడుగులు వేస్తున్నాం. బెర్తుల ఆధునికీకరణ పనులను వేగవంతం చేస్తున్నాం. కొద్ది నెలల్లో ఆధునిక పోర్టుగా రూపుదిద్దుకోనుంది.

– డా.అంగముత్తు, వీపీఏ చైర్మన్

18న 'విశాఖ తూర్పు'లో సాధికార యాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి
- విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపు

సాక్షి, విశాఖపట్నం/కొమ్మాది: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం నుంచి 30వ తేదీ వరకు జరగనున్న రెండో విడత సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సామాజిక సాధికార మొదటి విడత బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. అదే ఉత్సాహంతో నరసన్నపేట నుంచి రెండో విడత యాత్ర బుధవారం నుంచి ప్రారంభమైందన్నారు. ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో రెండవ విడత సామాజిక సాధికార యాత్ర ఉత్తరాంధ్ర షెడ్యూల్ విడుదల చేశారు. గురువారం రాజాం, 18న విశాఖ తూర్పు, 20న యలమంచిలి, 21న పాతపట్నం, 22న విశాఖ దక్షిణ, 23న బొబ్బిలి, 24న పాలకొండ, 25 పెందుర్తి, 27 ఎచ్చెర్ల, 28న నెల్లిమర్ల, 29న కురుపాం, 30న అరకులోయలో ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నట్లు చెప్పారు. యాత్రలో భాగంగా నాడు–నేడు పనులను పరిశీలిస్తున్నామని.. ఎక్కడైనా లోపాలుంటే సరిచేయాలని అధికారులకు వివరిస్తున్నామన్నారు. జనసేన నాయకుల విమర్శలకు సమాధానం ఇవ్వాల్సిన పనిలేదన్నారు. నాడు–నేడు ద్వారా జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆ పార్టీ నాయకులు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్ని పార్టీలు కలిసి పోటీ చేసినా అంతిమ విజయం వైఎస్సార్ సీపీదేనన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్సీ సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, సమన్వయకర్త కె.కె.రాజు, పార్టీ ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, పార్టీ కార్యాలయం పర్యవేక్షకుడు రవిరెడ్డి, పేడాడ రమణికుమారి, ద్రోణంరాజు శ్రీవత్సవ తదితరులు పాల్గొన్నారు.

రూ.7.91 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

స్థాయీ సంఘ సమావేశంలో ఒక అంశం వాయిదా



మాట్లాడుతున్న స్థాయీ సంఘ చైర్‌పర్సన్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి సుమారు రూ.7.91 కోట్ల అభివృద్ధి పనులకు స్థాయీ సంఘ సభ్యులు ఆమోదం తెలిపారు. స్థాయీ సంఘ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన బుధవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సమావేశం జరిగింది. 23 ప్రధాన అంశాలతో పాటు 13 టేబుల్ అజెండాలు పొందుపరచగా.. 35 అంశాలను సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారని చైర్‌పర్సన్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండో అంశం రెవెన్యూ విభాగానికి సంబంధించి తప్పుడు దస్తావేజులతో ఆస్తిపన్ను విధింపు విషయంలో వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో అప్పటి అధికారులపై విచారణ చేపట్టాలని సభ్యులు నిర్ణయించినట్లు చెప్పారు. 22వ అంశంపై సమగ్ర వివరణను మళ్లీ స్థాయీ సంఘానికి తెలియజేయాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తూ వాయిదా వేశామన్నారు. స్థాయీ సంఘ సభ్యులతో పాటు ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, కార్యదర్శి పి.నల్లనయ్య, జోనల్ కమిషనర్లు విజయలక్ష్మి, పి.సింహాచలం, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ పాల్గొన్నారు.

ఘనంగా గిరిజన స్వాభిమాన ఉత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మిషన్ డైరెక్టర్ రవీంద్ర

కొమ్మాది: స్వాతంత్ర్య పోరాటంలో గిరిజనుల కృషిని స్మరించుకోవడానికి, వారి సాంస్కృతిక వారసత్వాన్ని రక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జనజాతీయ గౌరవ్ దివస్ – గిరిజన స్వాభిమాన ఉత్సవాలు బుధవారం రుషికొండలో ఘనంగా ప్రారంభమయ్యాయి. గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ మిషన్ భవన్‌లో ముందుగా మిషన్ డైరెక్టర్ ఈసరవీంద్రబాబు జ్యోతి ప్రజ్వలన చేసి గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు చదువుతోపాటు ఇతర రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ నెల 26 వరకు జరగనున్న ఉత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.

జెడ్పీ వైస్ చైర్మన్ ఎన్నిక నేడే

వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా సుంకర గిరిబాబు



వైఎస్సార్‌సీపీ జెడ్పీ వైస్ చైర్మన్ అభ్యర్థి సుంకర గిరిబాబుకు బీ ఫారం అందజేస్తున్న వైవీ సుబ్బారెడ్డి

మహారాణిపేట : జిల్లా పరిషత్ ఉపాధ్యక్ష పదవికి గురువారం ఎన్నిక నిర్వహించనున్నారు. ఉదయం పది గంటలకు కలెక్టర్ మల్లికార్జున ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ మొదలవుతుంది. వైస్ చైర్మన్ ఎన్నిక కోసం జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్టు జెడ్పీ సీఈవో పోలినాయుడు తెలియజేశారు. ఈ ప్రత్యేక సమావేశంలో సభ్యులు ఉపాధ్యక్షుడిని ఎన్నుకుంటారని తెలిపా రు. ఉపాధ్యక్షుడిని ఒక సభ్యుడు ప్రతిపాదించగా మరో సభ్యుడు బలపర్చాల్సి ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ తరఫున జెడ్పీ వైస్ చైర్మన్ అభ్యర్థిగా పద్మనాభం జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబును ఆ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి బుధవారం ఎంపిక చేసి బి.ఫారం అందజేశారు. అలాగే జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధను పార్టీ విప్‌గా నియమించారు. సబ్బవరం జెడ్పీటీసీ సభ్యుడు, జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు సెప్టెంబర్ 10న అనారోగ్య కారణాలతో మృతి చెందంతో ఈ పదవి ఖాళీ అయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎన్నిక కోసం ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని నోటిఫికేషన్ జారీ చేశారు.

గంజాయి రవాణా కట్టడికి చర్యలు



అధికారులతో సమీక్షిస్తున్న సీపీ రవిశంకర్

అల్లిపురం: గంజాయి రవాణా కట్టడికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా, నివారణపై బుధవారం ఆయన తన కార్యాలయంలో ఆర్పీఎఫ్, ఎన్‌హెచ్‌ఏ, ఆర్టీసీ, జీఆర్‌పీ, సెబ్, డీఆర్ఐ, ఎయిర్‌లైన్స్, ప్రైవేట్ ట్రావెల్స్ అధికారులు, సిబ్బందితో కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి విస్తృతంగా వాహనాలను తనిఖీ చేయడం ద్వారా గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయగలమన్నారు. ముఖ్యంగా కే 9 టీమ్ (డాగ్ స్క్వాడ్)లతో నగరమంతా విస్తృత తనిఖీలు ఇప్పటికే చేపడుతున్నామని చెప్పారు. ప్రతీ శాఖ డాగ్ స్క్వాడ్‌లకు తగు శిక్షణ ఇచ్చి వినియోగించుకోవాలని సూచించారు. డ్రగ్స్‌కు బానిసలైన వారికి మార్పు అనే కార్యక్రమం ద్వారా వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల జరిగే దుష్పరిణామాల గురించి స్కూళ్లు, కాలేజీలు, పబ్లిక్ ప్రదేశాల్లో అవగాహన కల్పించాలని, బ్యానర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీ–1 కె.శ్రీనివాసరావు, సెబ్ ఏడీసీపీ బి.శ్రీనివాసరావు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు, ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎ.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న హుండీలో నగదు అపహరించిన సెక్యూరిటీ గార్డు

- విధుల నుంచి తొలగించిన దేవస్థానం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా వద్ద(కొండ దిగువ) విధులు నిర్వర్తిస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు హుండీలోని నగదు చోరీ చేశాడు. అతనిపై దేవస్థానం అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు విధుల నుంచి తొలగించారు. దేవస్థానంలో సెక్యూరిటీ బాధ్యతలు నిర్వర్తిస్తున్న రాపిడ్ ప్రొటెక్షన్ ఫోర్స్ సంస్థకు చెందిన గార్డు ఎస్.అప్పలరాజు తొలిపావంచా వద్ద పనిచేస్తున్నాడు. ఈ నెల 14వ తేదీ మంగళవారం మధ్యాహ్నం తొలిపావంచా వద్ద ఉన్న హుండీలో చేయి పెట్టి రూ.1,153 తీసి దాని వెనుక వేశాడు. దీన్ని కొందరు వీడియో తీసి దేవస్థానం అధికారులకు పంపించారు. దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి ఆదేశాలతో ఈఈ రాంబాబు, ఏఈ హరి తొలి పావంచా వద్ద విచారించారు. విచారణలో అప్పలరాజు హుండీలో నుంచి నగదు తీసినట్టు ఒప్పుకున్నాడు. దీంతో అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేసి విధుల నుంచి తొలగించారు.

విక్షిత్ భారత్ సంకల్ప యాత్ర విజయవంతం చేయాలి

కేంద్ర ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి సాల్మన్ ఆరోక్యరాజ్



మాట్లాడుతున్న కేంద్ర ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి సాల్మన్ ఆరోక్యరాజ్, చిత్రంలో కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్

మహారాణిపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈనెలలో ప్రారంభిస్తున్న విక్షిత్ భారత్ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి సాల్మన్ ఆరోక్యరాజ్ సూచించారు. బుధవారం ఆయన కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునతో కలిసి విక్షిత్ భారత్ సంకల్ప యాత్ర సన్నద్ధత, కార్యక్రమ ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విక్షిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లాలో ఈనెలలో ప్రారంభమై జనవరి 26వ తేదీ వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమ నిర్వహణకు నోడల్ అధికారి, ఆహ్వాన, ఉత్సవ కమిటీల నియామకం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రోజుకు రెండు పంచాయతీల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి చిత్ర ప్రదర్శన, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమం నిర్వహించే రోజుల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కూడా ఉండేలా షెడ్యూల్ చేసుకోవాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ మైదానం, రూరల్ ప్రాంతాలలో ఈ నెల చివర నుంచి యాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జిల్లాలో సుమారు రెండు నెలలపాటు జరిగే యాత్ర షెడ్యూల్ ప్రకారం, ప్రణాళికా బద్ధంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, జిల్లా రెవెన్యూ అధికారి కె మోహన్‌కుమార్, గ్రామ, వార్డు సచివాలయ అధికారి పూర్ణిమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా పౌర సరఫరాల అధికారి సూర్యప్రకాశరావు, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, హౌసింగ్ ప్రాజెక్టు అధికారి శ్రీనివాసరావు, పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ గణపతి, జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి, జిల్లా ఉద్యాన అధికారి మన్మధరావు, జిల్లా మత్స్య శాఖధికారి ఎం.విజయ, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు గంభూషియా చేపల విడుదల

డాబాగార్డెన్స్: నగరంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు నీటి ఆవాసాల్లో గంభూషియా చేపలు విడుదల చేస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ సీజన్‌లో 20 లక్షల గంభూషియా చేపలు విడుదల చేసేందుకు 7,130 నీటి ఆవాసాలు గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇప్పటి వరకు 8 లక్షల చేపలు నీటి ఆవాసాల్లో జీవీఎంసీ మలేరియా విభాగం ద్వారా విడుదల చేశామని, ఈ వారంలో మరో 6 లక్షల గంభూషియా చేపల విడుదలకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. మలేరియా, డెంగ్యూ వ్యాధులను కలుగజేసే ఎనాఫిలాస్, ఏడిస్ దోమల సంఖ్య గణనీయంగా తగ్గించి దోమకాటు నుంచి ప్రజలకు రక్షణ కల్పించే చర్యలు చేపట్టామన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా గంభూషియా చేపలను నీటి ఆవాసాల్లో విడుదల చేయడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చని చెప్పారు. నగరంలోని నివాసులు ప్రతి ఇంట్లో దోమలు వృద్ధి చెందకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని, ప్రతి శుక్రవారం విధిగా నీటి నిల్వలను ఖాళీ చేసి ఆరబెట్టి డ్రైడే పాటించాలని ప్రజలను కమిషనర్ కోరారు.



జ్ఞానధార

స్ఫూర్తి నిలయాలు.. గ్రంథాలయాలు

విద్య అజ్ఞానంపై సంధించిన వజ్రాయుధమైతే.. అజ్ఞాన గాఢాంధకారాన్ని తొలగించే అక్షరహారం పుస్తకం. దైవం కొలువున్న ప్రదేశం దేవాలయమైతే.. జ్ఞానజ్యోతిని వెలిగించే గ్రంథాలకు నెలవైన దేవాలయం గ్రంథాలయం. స్వాతంత్ర్య పోరాటానికి, ఉద్యమ కార్యాచరణకు వేదికలుగా నిలిచి.. ఎంతో మందిని విప్లవ మార్గంలో నడిపి.. దేశానికి స్వాతంత్ర్యం రావడంలో కీలక పాత్ర పోషించాయి గ్రంథాలయాలు. అనంతర కాలంలో సమాజానికి మంచి నేస్తాలుగా మారాయి. నేటి కాలంలో గ్రంథాలయాలు తమ ఉనికిని చాటుకుంటూ.. మారిన కాలానికి తగ్గట్టుగా సేవలను మార్చుకుంటున్నాయి. గతంలో కాలక్షేపానికి, పఠనాసక్తిని రేకెత్తించడానికి ఉపయోగపడిన గ్రంథాలయాలు.. నేడు విద్యార్థులను ఉన్నత ప్రమాణాలు కలిగిన విజ్ఞాన వంతులుగా తీర్చిదిద్దడంలో, ఉద్యోగార్థులకు విజయాలను అందించే జ్ఞాన దీపికలుగా నిలుస్తున్నాయి.

గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా ప్రత్యేక కథనం.

– విశాఖపట్నం డెస్క్

ఆస్తులు కరిగిపోవచ్చు.. ధనం దొంగలపాలు కావచ్చు.. అనుబంధాలు చెరిగిపోవచ్చు.. కానీ విజ్ఞానం అలా కాదు.. ఒక్కసారి విజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటే.. తనువు చాలించే వరకు అది జీవితాన్ని ముందుకు నడిపిస్తూనే ఉంటుంది. ఆ విజ్ఞానం అందించే పుస్తకాన్ని హస్తభూషణం అంటారు పెద్దలు. ప్రతీ ఒక్కరూ పుస్తకాలను చదవాలని, విజ్ఞాన సముపార్జన జరగాలని, దానితోనే సమాజ పురోభివృద్ధి సాధ్యమవుతుందని భావించి.. ఎందరో విజ్ఞులు గ్రంథాలయాల కోసం ఉద్యమించారు. అయితే విజ్ఞాన భాండాగారాలుగా విలసిల్లిన గ్రంథాలయాల్లో పాఠకుల సంఖ్య తగ్గి.. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల సంఖ్య పెరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో గ్రంథాలయాలు.. కాలానికి తగ్గ మార్పులతో మనుగడ సాగిస్తున్నాయి. ఎన్నో జీవితాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి.

పుస్తకం పట్టనిదే రోజు గడవదు

ఇప్పుడు ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ కనిపిస్తున్నా.. గ్రంథాలయానికి వచ్చే వాళ్లు పుస్తకం పట్టనిదే పూట గడవని విధంగా తమను తాము మలుచుకున్నారు. ఒకప్పుడు కొత్త నవల మార్కెట్ లోకి వచ్చీ రాగానే అమ్ముడైపోయేవి. అయితే ఇప్పటికీ గ్రంథాలయంలో లభిస్తున్న నవలలు, వీక్లీలు, ఇతరత్రా పుస్తకాలను శాశ్వత సభ్యత్వం కలిగిన సభ్యులు ఇళ్లకు తీసుకెళ్లి చదువుతున్నారు. ఉద్యోగ ప్రయత్నంలో అభ్యర్థులు అక్షర యజ్ఞం చేస్తుంటారు. ఉదయం గ్రంథాలయం తెరవగానే అక్కడ వాలిపోతారు. మధ్యాహ్నం భోజనం చేసి.. సాయంత్రం తాళాలు వేసే వరకు తామ వెంట తెచ్చుకున్న పుస్తకాలతో పాటు అక్కడ లభించే పుస్తకాలను ఔపోషణ పడతారు. ఆధునిక కాలంలో గ్రంథాలయాలు పోటీ పరీక్షల అభ్యర్థులకు కల్పవృక్షాలు మారాయి.



కర్తవ్యాన్ని గుర్తుచేసేది గ్రంథాలయం



ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం విద్యార్థిగా చేరిన సమయంలో ఎస్‌ఐ ఉద్యోగాల నోటిఫికేషన్ వెలువడింది. ఆ సమయంలో ఏయూ గ్రంథాలయం ఎంతో ఉపయుక్తంగా నిలిచింది. పూర్తి సమయాన్ని గ్రంథాలయంలో గడుపుతూ పరీక్షకు సన్నద్ధం అయ్యేవాడిని. గ్రంథాలయం, పక్కనే ఉన్న రీడింగ్ రూమ్ ఎప్పుడూ నాలో పోటీతత్వాన్ని నింపేవి. నా ఉన్నతికి, లక్ష్యాన్ని చేరుకోవడానికి ఏయూ గ్రంథాలయం ఎంతగానో దోహదపడింది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి గ్రంథాలయాన్ని మించిన అనుకూలమైన స్థలం మరొకటి ఉండదు.

– బి.గణేష్, ఎస్‌ఐ, శ్రీకాకుళం వన్ టౌన్

ఉద్యోగ అన్వేషణలో ఉన్నా..



ఎంసీఏ పూర్తి చేశాను. బ్యాంకింగ్ రంగంలో స్పెషలిస్ట్ పోస్టులకు ప్రిపేర్ అవుతున్నా. ప్రతి రోజూ ఉదయం 9.30 గంటలకు ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయానికి చేరుకుంటా. సాయంత్రం 7.45కి మళ్లీ ఇంటికి వెళ్తా. చదువు పూర్తయినంత వరకు లైబ్రరీకి అంతంతమాత్రంగానే వెళ్లేవాడిని. కానీ గత ఏడాది నవంబర్‌లో ఇక్కడి లైబ్రరీకి వచ్చినప్పటి నుంచి నాలో ఎంతో మార్పు వచ్చింది. చుట్టుపక్కల వాళ్లను చూస్తే మనకు కూడా బాగా చదవాలనే పట్టుదల పెరుగుతుంది. ఇక్కడ అన్ని పుస్తకాలు, సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ఐబీపీఎస్ ఆర్‌ఆర్‌బీ ఇంటర్వ్యూ ఫేస్ చేశా. నా లక్ష్యం సాధించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నా.

– శివగణేష్, ఎంవీపీకాలనీ

చిన్నప్పటి నుంచి పుస్తక పఠనం



చిన్నప్పుడు నేను చదువుకునే రోజుల్లో నాన్నకు అప్పటి వర్తమాన అంశాలపై ఆసక్తి ఉండేది. కానీ చదవలేరు. పత్రికలు తెప్పించి నాతో చదివించి వినేవారు. అలా నాకు పాఠ్యాంశాలతో పాటు పత్రికలు, పుస్తకాలు చదవడంపై ఆసక్తి ఏర్పడింది. అప్పట్లో ఏవీఎన్ కళాశాల డౌన్‌లో గ్రంథాలయం ఉండేది. 1960లో అనుకుంటా.. అక్కడ చదవడం ప్రారంభించాను. తర్వాత దండుబజార్, ఇప్పుడు ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయం. నా వయసు 71 ఏళ్లు. ప్రతి రోజూ సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు క్రమ తప్పకుండా గ్రంథాయాలయానికి వస్తాను. మొదట్లో పొలిటికల్ వార్తలు, కథనాలు బాగా చదివేవాడిని. ఇప్పుడు ప్రతి రోజూ దినపత్రికలు ఒక సారి తిరగేస్తా.. ఆధ్యాత్మిక పత్రికలు, పుస్తకాలు ఎక్కువగా చదువుతున్నాను. రోజూ భగవద్గీత వింటా. పుస్తక పఠనం.. అలవాటు ఉన్న వ్యక్తిని పరిపూర్ణ మనిషిగా మార్చేస్తుంది. మానసిక ఒత్తిడి తగ్గిస్తుంది. ఉపకారం చేయడం నేర్పుతుంది.

– జి.రామారావు, విశ్రాంత ఆర్టీవో, సీతంపేట

విశాఖలో గ్రంథాలయ చరిత్ర

విశాఖపట్నంలో గ్రంథాలయాలకు చాలా ప్రాధాన్యం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో తొలి గ్రంథాలయం **విశాఖపట్నంలో ఏర్పాటు చేసి**నట్లు చరిత్ర చెబుతోంది. 1886లో విశాఖపట్నంలో సొంత ప్రేరణతో **మంతిన సూర్యనారాయణమూ**ర్తి పౌర గ్రంథాలయం నెలకొల్పినట్లు చరిత్రకారులు చెబుతారు. ఆపైన **గ్రంథాలయోద్యమం ప్రారంభ**మై ఇతర ఉద్యమాలకు చేయూతనివ్వడమే కాక పలు రంగాల్లో తెలు**గువారి చైతన్యానికి చేయూత**నిచ్చింది. ప్రస్తుతం దండుబజార్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయం, **నెహ్రూ బజార్‌లోని ప్రాంతీయ** గ్రంథాలయం, ద్వారకానగర్‌లోని పబ్లిక్ లైబ్రరీ, ఏయూలో వీఎస్ కృష్ణ **లైబ్రరీతో పాటు ఏవీఎన్, ఆం**ధ్రా మెడికల్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన గ్రంథాయాలు, రీడింగ్ **రూమ్‌లు బాగా ప్రాచుర్యం పొం**దాయి. బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంఎస్సీ, ఎం**కాం, ఎంఏ బీఎడ్, ఎంపెడ్,** ఎంటెక్.. ఇలా ఉన్నత చదువులు చదివి పోటీల పరీక్షలకు సిద్ధమవుతున్న **వేలాది మంది ఆయా గ్రంథా**లయాల్లో నిత్యం కనిపిస్తారు. విద్యార్థులే కాదు పదవీ విరమణ పొందిన **ఉద్యోగులు సైతం గ్రంథాలయా**నికి నిత్య విద్యార్థులుగా వస్తుండటం విశేషం. జీవితంలో ఎన్నో ఆటు**పోట్లను ఎదుర్కొన్న వాళ్లు శేష** జీవితంలో ప్రశాంతతను వెతుక్కుంటూ పుస్తకాలతో స్నేహం చేస్తు**న్నారు. ప్రతి రోజూ ఈ గడప** తొక్కనిదే తమకు ఏమీ తోచదని చెప్పడం చూస్తే పుస్తకాలు వాళ్ల జీవితం**లో ఎంతో భాగమయ్యాయో** అర్థమవుతుంది. కొందరు దాతలు తాము ప్రేమగా చూసుకున్న పుస్తకా**లను గ్రంథాలయాలకు ఇచ్చి** పుస్తక ప్రియులను ప్రోత్సహిస్తున్నారు.

విద్యార్థులకు ఉపయుక్తం



ఇంటర్ వరకు చదువుకున్న నేను పోలీస్ కానిస్టేబుల్ పరీక్షకు సన్నద్ధమవుతున్నాను. జిల్లా లైబ్రరీకి వచ్చి జనరల్ నాలెడ్జి పుస్తకాలు చదువుతున్నాను. ఇక్కడ మనకు కావాల్సిన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. ఈ లైబ్రరీ ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు తెరచి ఉంటుంది. మాలాంటి విద్యార్థులకు జిల్లా కేంద్ర గ్రంథాలయం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది.

–అలపన సంతోష్‌కుమార్, విశాఖపట్నం

గ్రూప్స్‌లో ఉద్యోగం సాధించడమే లక్ష్యం



ఎమ్మెస్సీ, బీఈడీ పూర్తి చేశాను. తగరపువలస నుంచి ప్రతి రోజూ ద్వారకానగర్‌లోని గ్రంథాలయానికి వస్తుంటా. ఇక్కడ ఏర్పాటు చేసిన కెరీర్ వింగ్ పోటీ పరీక్షల అభ్యర్థులు చాలా ఉపయుక్తంగా నిలుస్తుంది. ఇక్కడ ప్రశాంత వాతావరణం, సమకూర్చిన సదుపాయాలు అద్భుతం. మనకు అవసరమైన ఏ పుస్తకం కావాలన్నా వెంటనే సమకూరుస్తారు. కంప్యూటర్ సౌకర్యం ఉంది. దీంతో చదువుకునేందుకు ఎంతో ఆసక్తిగా ఉంటుంది. గ్రూప్స్‌లో ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా చదువుతున్నా..

– కవిత, ఎమ్మెస్సీ, బీఈడీ, తగరపువలస

అడిగిన వెంటనే కొత్త పుస్తకాలు



నేను బీఎస్సీ కెమిస్ట్రీ చదివాను. పోలీస్ శాఖ మీద మక్కువతో ఎస్‌ఐ, కానిస్టేబుల్ పరీక్షల కోసం ప్రిపేర్ అవుతున్నాను. జిల్లా గ్రంథాలయంలో విద్యార్థులకు కావాల్సిన పోటీ పరీక్షల పుస్తకాలన్నీ ఉన్నాయి. కొత్తగా ఏవైనా పుస్తకాలు కావాలని చెబితే లైబ్రేరియన్ ఆ పుస్తకాలు తెప్పిస్తున్నారు.

– పి. శ్వేత, విశాఖపట్నం



అందుబాటులో పుస్తకాలు..



పోటీ పరీక్షలకు సంబంధించి అన్ని పుస్తకాలు ఈ లైబ్రరీలో ఉన్నాయి. ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు ఇక్కడ విద్యార్థులు కావాల్సిన పరీక్షలకు ప్రిపేర్ కావొచ్చు. ఇక్కడ సదుపాయాలు, వాతావరణం కూడా ఎంతో బాగుంది. నేను బీఎడ్ చదివాను. డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నాను.

– కె.లక్ష్మి, విశాఖపట్నం

ఆత్మజ్ఞానంతోనే మోక్షజ్ఞానం సాధ్యం

- పిల్లలను సంస్కారవంతులుగా తీర్చిదిద్దండి
- కళాభారతిలో రెండో రోజు గరికిపాటి ప్రవచనాలు

మద్దిలపాలెం : ఆత్మజ్ఞానంతోనే మోక్షజ్ఞానం సాకారమవుతుందని, జల కలశం మాదిరిగా మనసును నిర్మలంగా ఉంచుకోవాలని ప్రవచనకర్త డాక్టర్ గరికిపాటి నరసింహారావు సూచించారు. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో గత రెండు రోజులుగా శ్రీనాథుడి కలం నుంచి జాలువారిన ఆకాశ దీపం – కాశీ ఖండం గ్రంథంపై ఆయన ప్రసంగిస్తున్నారు. రెండో రోజు బుధవారం మాట్లాడుతూ వేదాలు, శాస్త్రాలు, పురాణాలు చదవి బ్రహ్మజ్ఞానాన్ని సంపాదించుకోవాలని సూచించారు. నేటి తరానికి డిగ్రీ వరకూ తెలుగు ప్రథమ భాషగా ఉంచాలని సూచించారు. నేటి తరం జ్ఞానాన్ని పెంపొందించుకునేలా శ్రద్ధగా చదవుకోవాలని సూచించారు. పిల్లలను సంస్కారవంతులుగా తయారు చేయడానికి వారిపై తల్లిదండ్రులు మమకారం తగ్గించుకోవాలన్నారు. చిత్తశుద్ధి లేని శివ పూజలు వ్యర్థమవుతాయన్నారు. యువ్వనంలో యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పిల్లలను తల్లి ప్రేమతో, తండ్రి బాధ్యతతో పెంచాలన్నారు. కార్యక్రమంలో వీఎండీఏ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.ఆర్, కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, పైడా క్రిష్ణప్రసాద్, కనకమహాలక్ష్మి బ్యాంకు చైర్మన్ రఘునాథరావు తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక బాలిక ఆత్మహత్య

పీఎం పాలెం : ప్రేమ పేరుతో వేధిస్తున్న యువకుడి ఆగడాలు తాళలేక ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. పీఎం పాలెం సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలివీ. నర్సీపట్నం ప్రాంతానికి చెందిన గుర్రం కృష్ణారావు నగరానికి వలస వచ్చి కొమ్మాది సాయిరాం కాలనీలోని డ్రైవర్స్ కాలనీలో కుటుంబంతో నివసిస్తున్నాడు. అతనికి ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె (16) శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. నర్సీపట్నం ప్రాంతానికి చెందిన నక్కా భరత్ అలియాస్ సాగర్ అనే యువకుడు ఆ బాలికను ప్రేమిస్తున్నానని కొన్నాళ్లుగా వెంబడిస్తూ వేధిస్తున్నాడు. ఆ ఆగడాలు తాళలేక తాను అనుభవిస్తున్న నరకయాతనను తండ్రి వద్ద మొరపెట్టుకుంది. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు భరత్‌ను రప్పించి కౌన్సెలింగ్ చేశారు. అయినప్పటికీ భరత్ పంథా మార్చుకోలేదు. మరింతగా వెంబడించి వేధించడంతో ఈ నెల 14న రాత్రి తండ్రి వద్ద మరోమారు మొర పెట్టుకుంది. భయపడ వద్దని, గట్టిగా బుద్ధి చెబుతానని తండ్రి ఓదార్చాడు. ఈ నేపథ్యంలో రాత్రి భోజనం తర్వాత ఒకే గదిలో అక్కతో కలిసి ఆ బాలిక నిద్రపోయింది. బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు ఆమె అక్క లేచి చూసేసరికి బాలిక ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతోంది. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయగా కిందకు దించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

భీమిలి బీచ్‌లో అల్లరి నరేష్ సందడి

కొమ్మాది: భీమిలి బీచ్‌లో బుధవారం సినిమా షూటింగ్ చేశారు. చిలక ప్రొడక్షన్ బ్యానర్‌పై మల్లి దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న ఓ సినిమాకు (ఇంకా టైటిల్ ఖరారు కాలేదు) సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. హీరో అల్లరి నరేష్, హీరోయిన్ ఫరియా అబ్దుల్లా (జాతిరత్నాలు ఫేమ్), వెన్నెల కిషోర్‌పై కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ షూటింగ్ లొకేషన్‌కు చేరుకుని హీరో అల్లరి నరేష్‌తో కాసేపు ముచ్చటించా రు. ఈ సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అదేవిధంగా వైజాగ్ పూర్ణా మార్కెట్ ప్రాంతాల్లో దర్శకుడు శంకర్ తెరకెక్కిస్తున్న భారతీయుడు – 2 సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు.

సత్వరమే వినతుల పరిష్కారం

దొండపర్తి : డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సీపీ డాక్టర్ ఎ.రవిశంకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సీపీ తన చాంబర్ నుంచి నిర్వహించిన డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి 11 మంది కాలర్స్ ఫోన్ చేసి ఫిర్యాదులు చేశారు. సీపీ ప్రతి ఒక్క కాలర్ సమస్యలు తెలుసుకుంటూ సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. వృద్ధుల నుంచి ప్రత్యేకంగా ఫిర్యాదులు స్వీకరించేందుకు మధ్యాహ్నం 12 నుంచి 12.30 వరకు అదనంగా సమయం కేటాయించగా.. ఒక కాలర్ ఫోన్ చేసి తాను స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదన్నారు. సీపీ తక్షణమే సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ద్వారా కేసు వివరాలు తెలుసుకున్నారు. ఈ నెల 1న నిర్వహించిన డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి వచ్చిన 17 ఫిర్యాదుల్లో ట్రాఫిక్‌కు సంబంధించి 8 పరిష్కరించారు. 3 ఫిర్యాదులు సివిల్ పరిధిలో ఉండడంతో వాటిని కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. 2 ఫిర్యాదులకు సంబంధించి ఫిర్యాదుదారులు అందుబాటులో లేకపోగా.. మిగిలిన 4 ఫిర్యాదులు పరిష్కరించారు.